నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- ప్రతీ పంచాయతీలో నిర్మాణం
- నిర్వహణ గాలికొదిలేసిన ప్రత్యేక అధికారులు
- నీరుగారిపోతున్న ప్రభుత్వ లక్ష్యం


లింగాలో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు


టాక్లిలో ప్రధాన రోడ్డుపై వేసిన చెత్త


నిరుపయోగంగా మిర్జాపూర్ సెగ్రిగేషన్ షెడ్డు

భైంసారూరల్: పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం గత ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. ఇంటింటి నుంచి చెత్తను సేకరించి, తడి వ్యర్థాలను షెడ్లకు తరలించి ఎరువుల తయారీకి నిర్ణయించింది. ఇలా చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం రావడమే దీని ముఖ్య ఉద్దేశం. మండలంలోని 30 గ్రామ పంచాయతీలు ఉండగా, ఒక్కో జీపీకి జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.2 లక్షలతో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. ప్రత్యేక అధికారుల పాలనలో వీటి నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. దీంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తుండడంతో పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.

చెత్తకు నిప్పు..

పల్లెల్లో చెత్తను తరలిస్తున్నా సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేయడం లేదు. షెడ్లలో నిర్మించిన కుండీలు వృథాగా పడి ఉన్నాయి. షెడ్లకు వెళ్లేలా పెద్ద రోడ్లు లేవు. దీంతో ట్రాక్టర్‌లో చెత్తను ఊరి పొలిమేరల్లో వేసి నిప్పుపెట్టేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి. చెత్తకు నిప్పుపెట్టడంతో వచ్చే పొగతో గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు.

సద్వినియోగం చేసుకుంటే..

30 పంచాయతీల్లో ఇంటింటా చెత్త సేకరణకు కోసం 30 ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. తడి, పొడి చెత్త వేరుచేసేలా గతంలో ప్లాస్టిక్ డబ్బాలను ఒక్కో ఇంటికి రెండు చొప్పున పంపిణీ చేశారు. అధికారులు దృష్టిపెడితే ఇంటి వద్దే తడి,పొడి చెత్తలు వేరు చేసుకోవచ్చు. ఫలితంగా ఈ చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించి ఎరువుగా మార్చవచ్చు. జిల్లా అధికారులు దృష్టిసారించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తేనే సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించిన లక్ష్యం నెరవేరుతుంది.

దుర్గంధం వస్తుంది



సమీప ప్రాంతాల్లో ఉన్న రోడ్లు, గుంతల్లో చెత్తవేసి వెళ్తున్నారు. వర్షానికి తడిసి దుర్గంధం వస్తుంది. ఒక్కోసారి రోడ్డు పక్కనే చెత్తను వేసి తగులబెడుతున్నారు. తగులబెట్టిన పొగ నుంచి వచ్చే వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నాం. చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకే తరలించాలి.

– గంగాధర్, టాక్లి

చర్యలు తీసుకుంటాం

కొన్నిచోట్ల సెగ్రిగేషన్ షెడ్లకు ట్రాక్టర్లు వెళ్లే పరిస్థితి లేదు. స్థలం ఇరుకుగా ఉండడమే ఇందుకు కారణం. ప్రతీ పంచాయతీలోనూ చెత్తను తీసుకువెళ్లి సెగ్రిగేషన్ షెడ్లలో వేసేలా చర్యలు తీసుకుంటాం. ట్రాక్టర్లల్లో చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకే తరలిస్తాం.

– మోజంహుస్సేన్, ఎంపీవో

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు


నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) సమీపంలోని పంట పొలంలో విద్యుత్ తీగలు చేతికందేలా ఉన్నాయి. వరికోత సమయంలో రైతు కర్ర సహాయంతో విద్యుత్ తీగలను పైకి లేపి పట్టుకున్నారు. ఈక్రమంలో 'ఊతమిస్తేనే పొలం కోసేది'శీర్షికన సాక్షిలో ఈనెల 11న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన విద్యుత్ ఏఈ మహేశ్ సోమవారం సిబ్బందితో రెండు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి తీగలను సరిచేయించారు. దీంతో రైతులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

సింహగర్జన సభ జయప్రదం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహ గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ రంజిత్ కోరారు. మండలంలోని వడ్యాల్, చింతల్‌చాందలోని మాల సంఘం నాయకులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ సభకు మాలలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. అనంతరం గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు వెంకట స్వామి, ఎల్మల రాజేశ్వర్, ఎరోళ్ల పురుషోత్తం, రొడ్డ గంగన్న, ఈశ్వర్, ముతన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేపపిల్లల పంపిణీ


చేపపిల్లలు అందజేస్తున్న అధికారులు

ఖానాపూర్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులు, నాయకులు సోమవారం మత్స్యకారులకు వందశాతం రాయితీపై చేపపిల్లలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదేశాలతో వీటిని పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, మత్స్య పరిశ్రమ శాఖ ఖానాపూర్ అధ్యక్షులు పరిమి సురేశ్, ఎంపీడీవో సునీత, ఎఫ్‌డీవో విజయ్, నాయకులు నిమ్మల రమేశ్, లక్ష్మీపతిగౌడ్, తిరుపతిగౌడ్, గణేశ్, నవీన్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ


కుంటాలలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కుంటాల: ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. సోమవారం అర్లి(కె) 61 జాతీయ రహదారి, కల్లూరు–కుంటాల మార్గంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువపత్రాలను పరిశీలించారు. ఏఎస్సై జీవన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


సాయం అందజేస్తున్న ఉద్యోగులు

కుంటాల: కుంటాల మండల సమాఖ్యలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న కుర్ర నవీన్ తల్లి శోభ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మండల సమాఖ్య, ఐకేపీ సిబ్బంది సోమవారం రూ.25వేల నగదును అందజేశారు. ఏపీఎం అశోక్, వీవోఏలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మామడ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని పొన్కల్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అరవింద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని సోమవారం సందర్శించారు. భోజనశాల, తరగతి గదులు, టాయిలెట్లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఎస్‌ఓ జ్యోతి, సీఆర్పీ నారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొనసాగుతున్న సప్తాహం

భైంసారూరల్: మండలంలోని సిద్దేశ్వర ఆలయంలో అఖండ హరినామా సప్తాహం కొనసాగుతోంది. ఈనెల 29 తేదీ వరకు ఆలయంలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హారతి, జ్ఞానేశ్వరి పారాయణం, గాథ భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సప్తాహానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు భూమిపూజ

తానూరు: ప్రజాపాలన, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు మంగళవారం భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల నాయకులు, కూలీలు హాజరుకావాలని కోరారు.

బాధిత కుటుంబానికి అండగా..

- దుబాయ్‌లో గుండెపోటుతో యువకుడు మృతి
- పేద కుటుంబానికి మల్లాపూర్ గ్రామస్తుల సాయం


కుటుంబానికి నగదును అందిస్తున్న గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన యువకుడు ఆకుల గణేశ్ దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. అక్కడ డ్రైవర్‌గా పనిచేస్తున్న అయనకు 20 రోజుల క్రితం గుండెపోటుతో అకాల మరణం చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నిరుపేద అయిన ఆ కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. ఆర్థికసాయం అందించాలని గ్రామ వీడీసీ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. సుమారు 300 కుటుంబాలు తమకు తోచిన సాయం చేయగా రూ.2,62,727ల నగదు పోగయ్యాయి. పీచరకు చెందిన జానపద గాయకుడు, రౌడీ సింగర్ గోపి తన ఇన్‌స్టాగామ్ ద్వారా సుమారు రూ.43 వేలు విరాళాలు సేకరించారు. దుబాయ్‌లో గణేశ్‌తో కలిసి పనిచేసిన అక్కడి డ్రైవర్లు సేకరించిన రూ.14 వేలు, ఇలా మొత్తం రూ.3,19,722ల నగదును సోమవారం బాధిత కుటుంబానికి అందించారు. ఆర్థికసాయం అందించిన ప్రతీ ఒక్కరికి మృతుడి తండ్రి ఆకుల పెంటయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, పాత ఎల్లాపూర్ ప్రాంతంలో రోడ్డుపై అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నామని డిప్యూటీ తహసీల్దార్ మంజుల తెలిపారు. తహసీల్దార్ శివరాజ్ ఆదేశాలతో ఆర్‌ఐ.. రెండు ట్రాక్టర్లు పట్టుకున్నారని పేర్కొన్నారు.

పలు షాపులకు జరిమానా

నిర్మల్‌చైన్‌గేట్: నిబంధనలు పాటించని పలు షాపులకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్ కుమార్ జరిమానా విధించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా దుకాణదారులకు రూ.4.20 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఖానాపూర్‌లో అక్రమంగా గుట్కా విక్రయిస్తున్నందుకు, ఆహార పదార్థాల లేబులింగ్ సరిగ్గా వేయనందుకు రాందేవ్ జనరల్స్ దుకాణానికి రూ 1.50 లక్షలు, ఆహార పదార్థాల విక్రయ లైసెన్సు లేకుండానే అమ్ముతున్నందుకు రుద్రాన్ష్ మిఠాయిల దుకాణానికి రూ 2 లక్షలు, పురుగు పట్టిన కందిపప్పు విక్రయించిన ముధోల్‌లోని బాలాజీ కిరాణా దుకాణానికి రూ.70 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం


రమ్య (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌కు చెందిన వివాహిత పంచగూడ రమ్య (23) అదృశ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సారంగాపూర్ మండలం అడెల్లి పోచమ్మ పండుగ కోసం ఆదివారం బంధువుల వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ దొరకకపోవడంతో భర్త మధు సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని శివారులోని శ్రీ చక్ర లింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పూజారి రాజేశ్వర్ సోమవారం ఉదయం చూసేసరికి హుండీ తాళం పగులగొట్టి ఉంది. రూ.4 వేల నగదు, గర్భగుడిలో నూనె డబ్బాను ఎత్తుకెళ్లారని పూజారి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

కౌలు సమస్యపై అసెంబ్లీలో గళమెత్తాలి


ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న నాయకులు

భైంసాటౌన్: కౌలు రైతుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తాలని రైతు స్వరాజ్య వేదిక నాయకులు కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ నివాసంలో సోమవారం ఆయన్ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని, దీనిపై రైతుల పక్షాన అసెంబ్లీలో తమ గళాన్ని వినిపించాలని ఎమ్మెల్యేను కోరారు. రైతు భరోసాతోపాటు రుణమాఫీ కాని రైతుల గురించి అసెంబ్లీలో లేవనెత్తాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే రైతుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడతానని వారికి హామీ ఇచ్చారు. రైతు స్వరాజ్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొర్రన్న, రైతులు మాణిక్‌రావ్, లస్మన్న, కిష్టు, సతీశ్, వెంకటేశ్, వివేకానంద తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే గద్దె దిగాలి


ధర్నా చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యలు పరిష్కరించలేకపోతే ప్రభుత్వాలు గద్దె దిగాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రామగిరి రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే ఉచితంగా విద్య వైద్యం అందించాలని, ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలన్నారు. అర్హులందరికీ ఎకరం భూమి, ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. రజక సంఘం జిల్లా నాయకులు నిమ్మల చిన్న గంగాధర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులు శివయ్య, నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పాతర్ల హరీశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, మాదిగ అంబేద్కర్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లింగన్న, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌లు ఈ ధర్నాకు సంఘీభావం తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజు, సిలారి శ్రీనివాస్, సొన్న భూమేశ్, కల్లూర్ సుధాకర్, కుందూరు వినోద్, కత్తి శేఖర్, షేక్ నయీం, తొర్తి గణేశ్ పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి


మాట్లాడుతున్న రాజు

భైంసాటౌన్: రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని ఏఐకేఎంఎస్, ఇఫ్టూ, టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని గాంధీగంజ్‌లో సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు మాట్లాడారు. ఈనెల 26న చేపట్టనున్న ప్రజా, రైతు, కార్మిక నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఢిల్లీ రైతు దిగ్బంధనం ముగింపు సందర్భంగా రైతాంగానికి ఇచ్చిన లిఖితపూర్వక హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరిత, టీయూసీఐ అధ్యక్ష, కార్యదర్శులు బక్కన్న, రామ్‌లక్ష్మణ్, సందేశ్, విఠల్, హాజీ, కలిప్, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


రైతుల వివరాలు ట్యాబ్‌లో పరిశీలిస్తున్న ఏఈవో


ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏవో నవీన్

సోన్: మండల కేంద్రంలో డీసీఎంఎస్, పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఈవో ఉమామహేశ్వరి సోమవారం పరిశీలించారు. అనంతరం ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్‌లో పరిశీలించారు.

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో నవీన్ సోమవారం పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతం 17, తాలు తప్ప 1 శాతం కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఏఈవో రాజ్‌కుమార్, రైతులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పూజలో స్వాములు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో సోమవారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి సాయినాథ్ ఆధ్వర్యంలో ఉదయ్‌రెడ్డి కన్నెస్వామి.. అయ్యప్ప, వినాయక, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వాములు భజన, భక్తిగీతాలు అలరించాయి. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముధోల్: మండల కేంద్రంలోని కోలీగల్లీలో సోమవారం అయ్యప్ప పడిపూజను నిర్వహించారు. గురుస్వాములు దత్తు, జీవన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విగ్రహాన్ని అలంకరించి పూజలు చేశారు. గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వాములు విలాస్, భూమేశ్, సాయినాథ్, దిగంబర్ తదితరులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్నికైన సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటగిరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా రాకేశ్, కోశాధికారిగా సత్యనారాయణతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వారిని సంఘం సభ్యులు పూలమాల శాలువాతో సన్మానించారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని ఎన్నికైన సభ్యులు పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో మధుసూదన్

సారంగపూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో మధుసూదన్ అన్నారు. మండలంలోని జామ్‌లో కేజీబీవీ, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. గురుకులంలో విద్యార్థులకు వండిపెట్టిన భోజనం పరిశీలించారు. అనంతరం కేజీబీవీలో మధ్యాహ్నభోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, గురుకుల ప్రిన్సిపాల్ రాధిక ఉన్నారు.

మలుపుల వద్ద బస్సులు


అర్లి(కె) క్రాస్‌రోడ్ వద్ద..


కల్లూరులో మూలమలుపు వద్ద నిలిపిన బస్సు

కుంటాల: మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. భైంసా నుంచి నిర్మల్ 61 జాతీయ రహదారిపై బస్సులు అటు ఇటు రాకపోకలు సాగిస్తున్నాయి. నిర్మల్ నుంచి చిట్యాల, సిర్గాపూర్, దిలావర్‌పూర్, గుండంపల్లి, అర్లి(కె), కల్లూరు, వానల్పాడ్, మాటేగాం గ్రామాల్లో బస్టాప్‌ల వద్ద బస్సులు ఆపడం లేదు. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద బస్సులు నిలపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే నర్సాపూర్(జి)మండల కేంద్రంలో బస్టాప్ వద్ద బస్సులు ఆపుతున్నారు. మిగతా ఎక్కడ కూడా బస్సులు ఆపడం లేదు. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు బస్టాప్‌ల వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.